

## గ్యాంగ్‌స్టర్ 'థగ్‌లైఫ్'

కమల్‌హాసన్, మణిరత్నం కలయికలో వచ్చిన 'నాయకుడు' చిత్రం భారతీయ కల్ట్‌క్లాసిక్ చిత్రాల్లో ఒకటిగా నిలిచిపోయింది. మళ్లీ 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ లివింగ్ లెజెండ్స్ ఇద్దరూ 'థగ్‌లైఫ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు. నిర్మాణం నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలేర్పడ్డాయి. 'పొన్నియన్ సెల్వన్' వంటి బ్లాక్‌బస్టర్ సిరీస్ చిత్రాల తర్వాత మణిరత్నం దర్శకత్వంలో వస్తున్న చిత్రమిదే కావడంతో దేశవ్యాప్తంగా హైప్ క్రియేట్ అయింది. గురువారం కమల్‌హాసన్ జన్మదినాన్ని పురస్కరించుకొని టీజర్‌తో పాటు రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 5న విడుదల చేయబోతున్నారు. టీజర్ యాక్షన్ హంగులతో ఆకట్టుకుంది. విజువల్స్‌ను బట్టి గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని అర్థమవుతున్నది. కమల్‌హాసన్ గెటప్, లుక్స్ విభిన్నంగా కనిపించాయి. పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని, కమల్‌హాసన్ నటవిశ్వరూపాన్ని ఆవిష్కరిస్తుందని మేకర్స్ పేర్కొన్నారు. త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యలక్ష్మి, అభిరామి, నాజర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె చంద్రన్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, రచన-దర్శకత్వం: మణిరత్నం.



## ఉత్తరాంధ్ర నేపథ్యంలో 'ఘాటి'

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి విభిన్న కథా చిత్రం తర్వాత అగ్ర నాయిక అనుష్కశెట్టి మరో వైవిధ్యభరితమైన సినిమా 'ఘాటి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. గురువారం అనుష్క జన్మదినాన్ని పురస్కరించుకొని ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. శరీరం మొత్తం ట్రైబల్ టాటూస్‌తో చేతిలో కొడవలి పట్టుకొని.. ఘాట్ రోడ్డులో ఆగివున్న ఓ బస్సులోకి అనుష్క ఎంట్రీ కావడం.. అందులో ఉన్న ఓ వ్యక్తి మెడను కర్కశంగా కోస్తూ , అద్దంలో తనని తాను చూసుకునే సీన్‌తో టీజర్ ఉత్కంఠను పంచింది. అనుష్క లుక్స్, స్క్రీన్‌ప్రజెన్స్ ఇంటెన్స్‌గా అనిపించింది. ఉత్తరాంధ్ర అటవీ ప్రాంత నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, అనుష్క పాత్ర శక్తివంతంగా ఉంటుందని, చిత్రీకరణ చివరి దశలో ఉందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, దర్శకత్వం, రచన: క్రిష్ జాగర్లమూడి.



## పీరియాడిక్ ప్రేమకథ

మంచులక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ముఖ్య పాత్రల్లో నటించిన పీరియాడిక్ ప్రేమకథ 'ఆదిపర్వం'. ఆదిత్య ఓం కీలక పాత్ర పోషించారు. సంజీవ్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వరరావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న కథ ఇదని, ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిచ్చే సినిమా అవుతుందని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన టి.ప్రసన్నకుమార్, ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

## ఏజ్ జస్ట్ నంబర్ అంతే



'భూల్ భులయ్యా 3' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది బాలీవుడ్ భామ విద్యాబాలన్. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి యావరేజ్ టాక్ వచ్చినా.. వసూళ్లు మాత్రం భారీగానే ఉన్నాయి. ఈ సందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'భూల్ భులయ్యా 3' షూటింగ్ విశేషాలను గుర్తుచేసుకుంది విద్యాబాలన్. ఆమె మాట్లాడుతూ- 'మాధురీ దీక్షిత్ మేడమ్ గురించి ఆలోచిస్తే ఆశ్చర్యమేస్తుంది. ఏజ్ అనేది ఆమెకు జస్ట్ నంబర్ అంతే. నాకూ ఆమెకూ వయసు రిత్యా పన్నెండేళ్లు తేడా ఉంది. ఇందులో మేం అక్కాచెల్లెళ్లుగా నటించాం. స్క్రీన్‌పై ఆమె నా ఏజ్‌లో కనిపించారు. నాకంటే తను పుష్కరకాలం పెద్దదంటే ఎవరూ నమ్మరు. డాన్స్‌లో అయితే ఆమెతో పోటీ పడలేకపోయా. ఆమెను ప్రేరణగా తీసుకొని నటిగా మారిన వాళ్లలో నేనూ ఒకదాన్ని. ఆమెతో కలిసి నటించడం నిజంగా గర్వంగా ఉంది. ఇప్పటికీ వన్నె తరగని అందం, ఫిఫ్టీ ప్లస్‌లోనూ తొణకని నాట్య కౌశల్యం మాధురీ మేడమ్ సొంతం.' అంటూ చెప్పుకొచ్చింది విద్యాబాలన్.

## ఆ నమ్మకం నిజమైంది

'కథ అందరూ బావుందన్నారు. కానీ కొందరు మాత్రం కమర్షియల్‌గా వర్కవుట్ అవుతుందా? అనే సందేహం వ్యక్తం చేశారు. అయితే.. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ నాలో నమ్మకాన్ని నింపారు. 'అన్ని వర్గాలకూ నచ్చుతుంది.. ధైర్యంగా తీయ్' అని వెన్ను తట్టారు. సినిమా విడుదలయ్యాక ఒక్క నెగెటివ్ కామెంట్ లేదు.' అని దర్శకుడు వెంకీ అట్లూరి అన్నారు. ఆయన దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా రూపొందిన చిత్రం 'లక్కీభాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. అక్టోబర్ 31న విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతున్నదని గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో దర్శకుడు వెంకీ అట్లూరి ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఏ సినిమాకైనా హీరోనే మెయిన్ పిల్లర్ అని నేను నమ్ముతాను. దుల్కర్ ఈ సినిమా ప్రారంభం నుంచీ ఇచ్చిన సహకారం జీవితంలో మరిచిపోలేను. సింగిల్ సిట్టింగ్‌లో కథ ఓకే చేశారాయన. అందరికంటే ముందు లొకేషన్‌లో ఉండేవారు. ఆయన ఫుల్ ఎనర్జీతో ఉండటం వల్ల, సెట్ అంతా సంతోషంగా ఉండేది. నిర్మాత నాగవంశీ ఈ కథను బాగా నమ్మారు. నేను అడక్కపోయినా.. కథకు తగ్గ భారీతనాన్ని తీసుకురావడంకోసం సెట్‌లను నిర్మించారు. రాజీ పడని ఆయన నిర్మాణ విలువలే సినిమాకు భారీ తనాన్ని తెచ్చాయి.' అని వెంకీ అట్లూరి చెప్పారు. రాంకీ, సర్వదమన్ బెనర్జీ లాంటి సీనియర్ నటులు నటించడం సినిమాకు కొత్త అందాన్నిచ్చిందనీ, సాంకేతికంగా కూడా అందరూ ప్రాణం పెట్టి పనిచేశారనీ, వందకోట్ల వసూళ్లకు 'లక్కీభాస్కర్' చేరువ అవతున్నందుకు గర్వంగా ఉందని వెంకీ అట్లూరి ఆనందం వెలిబుచ్చారు.



## దొరకునా ఇటువంటి ప్రేమ

వర్ధన్ గుర్రాల, హమరేశ్, శాంతి తివారి, నిత్యశ్రీ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ట్రెండింగ్ లవ్'. 'దొరకునా ఇటువంటి ప్రేమ' ఉపశీర్షిక. హరీశ్ నాగరాజు దర్శకుడు. సోనూ గుప్తా, రూపేశ్ డి గోయల్ నిర్మాతలు. మెగా డాటర్ కొణిదెల నిహారిక ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'దర్శకుడు హరీశ్‌తో గతంలో నేను ఓ షార్ట్‌ఫిల్మ్‌కు పనిచేశా. టాలెంటెడ్ డైరెక్టర్. ఈ సినిమాను ట్రెండీ లవ్‌స్టోరీగా తెరకెక్కించాడు. విజువల్స్ చాలా బాగున్నాయి' అని చెప్పింది. నేటి యువతకు కనెక్ట్ అయ్యే ప్రేమకథా చిత్రమిదని, వినోదానికి పెద్దపీట వేశామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బ్రహ్మతేజ మరిపూడి, సంగీతం: సునీల్‌కశ్యప్.





## 'బాహుబలి' చిత్రానికి సూర్యనే స్ఫూర్తి

'తెలుగు సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లాలనే విషయంలో నాకు సూర్యనే స్ఫూర్తినిచ్చారు. 'గజిని' టైమ్ నుంచి సూర్య ఇక్కడికి వస్తూ తన సినిమాలను ప్రమోట్ చేసుకుంటూ తెలుగు ప్రజలకు దగ్గరయ్యాడు. సూర్య తరహాలో మనం కూడా తమిళంలోకి వెళ్లాలని, అక్కడి ఆడియెన్స్ ఆదరణ పొందాలని నిర్మాతలతో చెబుతుండేవాడిని. ఈ విషయంలో సూర్యను ఓ కేస్ స్టడీలా తీసుకోవచ్చు' అన్నారు అగ్ర దర్శకుడు రాజమౌళి. గురువారం జరిగిన 'కంగువ' ప్రీరిలీజ్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ''బాహుబలి' వంటి పాన్ ఇండియా సినిమా తీయడానికి సూర్యనే నాకు స్ఫూర్తిగా నిలిచాడు. మేమిద్దరం కలిసి ఓ సినిమా చేద్దామనుకున్నాం. కానీ అనుకోని కారణాల వల్ల మిస్ అయింది. 'కంగువా' మేకింగ్ వీడియో చూస్తుంటే టీమ్ అంతా ఎంత కష్టపడ్డారో అర్థమవుతున్నది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికి ఆల్ ది బెస్ట్' అన్నారు. సూర్య మాట్లాడుతూ 'దాదాపు రెండేళ్ల పాటు శ్రమించి ఈ సినిమాను మీ ముందుకు తీసుకొచ్చాం. ఈ కథ విన్నప్పుడు ఎంతగానో ఎక్సైట్ అయ్యాను. ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. నా గత చిత్రాల తరహాలోనే ఈ సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుదని నమ్ముతున్నా' అన్నారు. దర్శకుడు శివ మాట్లాడుతూ 'వెయ్యేళ్ల వ్యవధిలో ఐదు తెగలు, వారి మధ్య ఉండే ప్రేమ, సంఘర్షణ, పోరాటాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. లార్జర్ దేన్ లైఫ్ మూవీగా సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది' అన్నారు. హీరో సూర్య తెలుగు ఇంటి కుటుంబ సభ్యుడిలా మారిపోయారని దర్శకుడు బోయపాటి శ్రీను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్‌బాబు, హీరోలు విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ తదితరులు పాల్గొన్నారు.

## ఛాలెంజ్‌గా అనిపించింది



'నేను మ్యూజిక్ అందించిన అమరన్, లక్కీభాస్కర్ చిత్రాలు ఈ దీపావళికి విడుదలై విజయాలు సాధించడం ఆనందంగా ఉంది. రాబోతున్న 'మట్కా' కూడా హిట్ పక్కా.' అంటూ నటుడు, సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్ నమ్మకం వెలిబుచ్చారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా కరుణకుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన హైబడ్జెట్ మూవీ 'మట్కా'. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. 'దర్శకుడు కరుణకుమార్ అద్భుతమైన స్క్రిప్ట్ నాలెడ్జ్ ఉన్న దర్శకుడు. ఆయన డార్క్ ఫిల్మ్ మేకింగ్ స్టైలిష్‌గా ఉంటుంది. నిర్మాతలు కూడా ఎక్కడా రాజీ పడకుండా హై బడ్జెట్‌లో సినిమా తీశారు. ఇది పీరియాడికల్ స్టోరీ. మ్యూజిక్ కూడా అందుకు తగ్గట్టే ఉండాలి. ఆడియన్‌ని ఆ కాలంలోకి తీసుకెళ్లాలి. అందుకే మోడరన్ సింథ్స్ వాడడం కుదరదు. పాత తరహా మ్యూజిక్‌నే వాడాలి. అది నాకు బిగ్ ఛాలెంజ్ అనిపించింది. పైగా 'మట్కా' గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్. 'గాడ్ ఫాదర్' తరహాలో వయోలెన్స్, యాక్షన్, హై ఎమోషన్ ఉంటుంది. అందుకే ఛాలెంజ్‌గా తీసుకొని చేశాను. ముఖ్యంగా స్టోరీ, డైరెక్షన్, నటీనటుల యాక్టింగ్ ప్రేక్షకుల్ని కట్టి పడేస్థాయి. తెరపై కొత్త వరుణ్‌తేజ్‌ని చూస్తారు.' అని చెప్పారు జి.వి.ప్రకాశ్‌కుమార్. సంగీత దర్శకునిగా వంద సినిమాలు పూర్తి చేయడం ఆనందంగా ఉందని, యుగానికొక్కడు, మద్రాసు పట్టణం, ఉల్లాసంగా ఉత్సాహంగా, డార్లింగ్, ఆకాశమే హద్దు, ఇప్పుడు 'మట్కా'.. ఇలా పొంతన లేని జానర్లకు సంగీతం అందించాననీ, ఆదరిస్తున్న దక్షిణాది ప్రేక్షకులందరికీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నాననీ జీవి ప్రకాశ్‌కుమార్ అన్నారు.

## 'ధూం ధాం' అనిపించే వినోదం



''ధూం ధాం' సినిమాలో ఎలాంటి కష్టాలు, కన్నీళ్లు ఉండవు. వందశాతం వినోదంతో ఆకట్టుకుంటుంది. ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది' అన్నారు చేతన్ కృష్ణ. ఆయన కథానాయకుడిగా సాయికిషోర్ మచ్చా దర్శకత్వంలో ఎంఎస్ రామ్‌కుమార్ నిర్మించిన 'ధూం ధాం' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చేతన్‌కృష్ణ మాట్లాడుతూ.. రెండున్నర గంటల పాటు కడుపుబ్బా నవ్వించే చిత్రమిదని, హీరోగా బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచానని చెప్పారు. చక్కటి ప్రేమకథతో పాటు, ఆద్యంతం హాస్యంతో సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు సాయికిషోర్ మచ్చా తెలిపారు. నిర్మాత రామ్‌కుమార్ మాట్లాడుతూ 'మా అబ్బాయి చేతన్‌కృష్ణ కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన చిత్రం. ఏ విషయంలోనూ రాజీపడకుండా తీశాం. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. హెబ్బాపటేల్, సాయికుమార్, వెన్నెల కిషోర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతాన్నందించారు.





